epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 103 | శనివారం | 31.08.2024



# టార్గెట్ 2026

## దేవాదులను పూర్తి చేస్తాం..

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరిస్తాం
- ఏడు జిల్లాలు సస్యశ్యామలం అవుతాయ్
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**2026 మార్చి నాటికి** దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ములుగు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా తుపాకులగూడెం వద్ద దేవాదుల పంపింగ్ స్టేషన్‌ను వారు సందర్శించారు.

2 లో



## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

3

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

2

- అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్



## దేవాదుల ప్రాజెక్టుకు నిధులు ఇవ్వండి

2

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

General News



# దేవాదులను పూర్తి చేస్తాం..

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరిస్తాం
- ఏడు జిల్లాలు సస్యశ్యామలం అవుతాయ్
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ములుగు , మన చౌరాస్తా :** 2026 మార్చి నాటికి దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ములుగు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల పంపింగ్ స్టేషన్‌ను వారు సందర్శించారు. ప్రాజెక్టు ఇంటెక్‌వెల్, పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నీటి పారుదల శాఖలో రూ.కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. ప్రతి ఎకరాకు నీరు అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. దేవాదుల ద్వారా 300 రోజులుగా 60 టీఎంసీల గోదావరి నీటిని ఎత్తిపోశామన్నారు. నీటి పారుదల శాఖలో పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని తెలిపారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయన్నారు. 2008 సంవత్సరంలో దేవాదుల ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసినట్టు గుర్తుచేశారు. సుమారు 15 సంవస్సరాలు ఈ ప్రాజెక్ట్ పనులు నత్త నడకన సాగాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఇంకా 3 వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందని, రైతులను రాజును చేయడమే ఉద్దేశంతో ప్రాజెక్టులకు అధిక ప్రాదాన్యత ఇస్తూ అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.ఆర్ నాగరాజు,



గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి, డాక్టర్ మురళి నాయక్ తమ తమ నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్, కాలువల పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తదితర సమస్యలపై మంత్రులకు వివరించారు. సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, నీటిపారుదల శాఖ అధికారులు, ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

### మంత్రులకు ఘన స్వాగతం

బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ములుగు జిల్లా జె.చొక్కారవు దేవాదుల ప్రాజెక్టుకు చేరుకున్నారు. వీరికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సితక్క, శాసన మండలి డెప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరిష్‌తో పలువురు ఎమ్మెల్యేలు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

# చేతులు జోడించి కోరుతున్నా..

- దేవాదుల లిఫ్ట్ ప్రాజెక్ట్ కోసం రూ.200 కోట్లు కేటాయించండి
- జనగామ సస్యశ్యామలం అవుతుంది
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని చేతులు జోడించి కోరారు జనగామ పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. భువనగిరి పట్టణ కేంద్రంలోని శుక్రవారం భువనగిరి పార్లమెంట్ స్థాయి నీటి పారుదల శాఖ సమీక్ష సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌కు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న పల్లా



మాట్లాడుతూ జనగామ దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కోసం రూ.200 కోట్లు కేటాయిస్తే.. తమ నియోజకవర్గం సస్య శ్యామలం అవుతుందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ 4 మోటార్లు ఆన్ చేసి చెరువులు నింపాలని ఈ సందర్భంగా కోరారు. నియోజక వర్గ ప్రజల తరుపున చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.




## పనులు నాణ్యతతో చేపట్టాలి

### అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** అంగన్‌వాడీ సెంటర్లలో చేపడుతున్నా పనులు నాణ్యతతో చేయాలని అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ సూచించారు. పాలకుర్తి మండలం దర్దేపల్లి, కొడకండ్ల మండలం ముండ్రాయి గ్రామాల్లో అంగన్‌వాడీ అప్‌గ్రేడేషన్ పనులను ఆయన పరిశీలించారు. దర్దేపల్లిలో పంచాయతీ లో ఫ్రైడే సందర్భంగా డ్రై డే కార్యక్రమం అమలు తీరును మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. పరిసరాల్లో చెత్త చెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చేయాలన్నారు. గ్రామాల్లోని పరిసరాలు, ఇండ్లలోను దోమలు గుడ్లు పెట్టకుండా టైర్లు, పాత వస్తువులు, కూలర్లు, కొబ్బరి బోండాలు వంటివి తొలగింప జేస్తూ నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం చేపడుతున్న డ్రై డే కార్యక్రమ ఉపయోగాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మురుగు కాలవల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం కొడకండ్ల మండలం మొండ్రాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయంతి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ వివర్స్ కాలానీలో హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి జనగామ కమిటీ సభ్యులు పోలోజు నర్సింహాచారి, రమాదేవి ఆధ్వర్యంలో జగద్గురువు శ్రీకృష్ణ భగవానుడి పల్లకీ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ భువనగిరి అధ్యక్షుడు దేవేందర్ మాట్లాడుతూ ఈ ప్రపంచమంతం ఏ శక్తి ఆధారంతో నిలిచి ఉన్నదో, ఆ శక్తియే ఒక మానవుడిగా వచ్చిన జన్మ శ్రీకృష్ణునిది అని పేర్కొన్నారు. మానవులు కృష్ణడి భగవద్గీత సారాంశమైన బ్రహ్మ, కర్మ, భక్తి యోగ సమాచారం తెలుసుకొని ధర్మ మార్గం ఆచరించాలన్నారు. కార్యక్రమంలో జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



Local News



# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- విష జ్వరాలు వ్యాప్తించకుండా జాగ్రత్తలు పాటించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలు తమ ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలు వ్యాప్తించకుండా ప్రజలు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా జనగామ మున్సిపాలిటీలోని 7, 10వ వార్డులను పరిశీలించారు. వార్డుల్లోని పలు వీధులలో పర్యటించి, కాలనీల్లో వర్షపు నీరు నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాల్వలు, రోడ్లపై చెత్తను, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను ట్రాక్టర్లతో వెంటనే తొలగించాలన్నారు. అనంతరం కాలనీల్లోని ఇంటి సభ్యులతో మాట్లాడారు. వారికి తగిన జాగ్రత్తలు చెప్పారు. ఇందులో భాగంగా వర్షాకాలం దృష్ట్యా దోమలు విజృంభించకుండా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. విష జ్వరాలు, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వ్యాధులు ప్రభలుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి, వైద్యం చేయించుకోవాలన్నారు. అలాగే డెంగ్యూతో బాధపడుతున్న రోగులను పరామర్శించి, మందులను సమయానికి తగ్గట్లుగా వేసుకోవాలని సూచించారు. పరిశీలనలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వార్డు అధికారి సదానందం, శానిటరీ ఇన్స్పెక్టర్ గోపయ్య, ఇతర సంబంధిత అధికారులు ఉన్నారు.





# పట్టణ సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు

– వైరల్ ఫీవర్లను అరికట్టండి
– జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలి
– సానిటేషన్‌పై దృష్టి పెట్టాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో పట్టణ సమస్యలపై కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. చైర్ పర్సన్ పోకల జమున అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొదటగా బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో డెంగ్యూ వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. డాక్టర్లు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా ఆసుపత్రి డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని, సీటీ స్కాన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. గతంలో ఎల్ఆర్ఎస్ విషయంలో ప్రభుత్వం ఫ్రీగా చేస్తానని చెప్పి ఇప్పుడు డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. కౌన్సిలర్ రాంచందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో టెండర్ కాని మడిగలను ఎందుకు టెండర్ వేయడం లేదని ప్రశ్నించారు. బండా పద్మ, జక్కుల అనిత సుమలత, పాండు మాట్లాడుతూ తమ వార్డుల్లో టెండర్లు అయినా పనులు ఎందుకు చేయడంలేదని, వేరే వార్డులో ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ 'స్వచ్ఛతనం పచ్చదనం' పేరు మీద అవార్డులు ఇస్తామని, మీ పేరు అవార్డులో ఉన్నదని తెలిపి తదుపరి అవార్డు లేదని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై బొట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అవార్డులనేవి పారదర్శంగా ఉండాలని, కలెక్టర్ ఆఫీసులో పైరవీకారులు చెబితే అవార్డులు వచ్చాయని అన్నారు. ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ తమ వార్డులో నీటీ ఇబ్బందులు ఉన్నాయని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. చంద్రకళ మాట్లాడుతూ శానిటేషన్ లేబర్ కు బట్టలు, నూనె, చీపర్లతో పాటు వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో వైద్య విద్య అధికారి డాక్టర్ కరుణాకర్ రాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ రాంప్రసాద్, డీఈ, సానిటరీ ఇన్స్పెక్టర్ గోపయ్య, మేనేజర్ రాములు, మధు, శ్రీకాంత్, కౌన్సిలర్ పాకా రమ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి రైతుకు రుణమాఫీ ఇవ్వాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. రేషన్ కార్డు లాంటి షరతులు పెట్టకుండా రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో రైతులను ఏకం చేసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ప్రతాప్ రెడ్డి, ఎగుర్ల ఎల్లయ్య, మల్లేశం, రాములు, శ్రీధర్, శంకరయ్య పాల్గొన్నారు.



# వైభవంగా భైరవ విగ్రహ ప్రతిష్ఠాపన

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన కొడ్వటూరు సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో భైరవ విగ్రహ ప్రతిష్ఠాపన దాత మాజీ ధర్మకర్త భీమ్ రెడ్డి మల్లారెడ్డి, కవిత దంపతుల చేతుల మీదగా వైభవంగా జరిగింది. అలాగే అదనపు అన్నసత్రం గదులలో పూర్ణహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కోడూరు సిద్దేశ్వర స్వామిని తమ పూర్వికులు నుంచి కొలుస్తున్నామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి కుటుంబ సభ్యులు శిరీశ్‌కుమార్ రెడ్డి, రమ్య, వెంకటేశ్వర్ రెడ్డి, సుష్మా, ఆదిశ్రీ, శ్రేయేతి, నిదిషా, ఈవో చిందం వంశీ, ఆలయ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



# ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ మనోహర అన్నారు. పనిచేసి పదవీ విరమణ పొందిన మండలంలోని బండనాగారం ఆయమ్మ, కేసిరెడ్డిపల్లి-2 ఆయమ్మ, బోనా కొల్లూరు ఆయమ్మ, ఆలంపూర్ సెకండ్ సెంటర్ ఆయాలు వెంకమ్మ, ఎల్లమ్మ, పుల్లమ్మ పదవీ విరమణ సభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్నీ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.




## సీపీఎస్ రద్దయ్యే వరకు విశ్రమించం

**జనగామ, మన చౌరాస్తా :** ఉద్యోగుల పాలిట శాపంలా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దయ్యే వరకు విశ్రమించకుండా పోరాటం చేస్తామని టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ ఖాజా షరీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో జరిగిన తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ , టీజీఈ జేఏసీ భాగస్వామ్య సంఘాల సమావేశానికి టీజీవో ప్రధాన కార్యదర్శి నీలం కొర్నేలియస్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఖాజా షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవనాన్ని కొనసాగించాలన్నా.. ఆర్థిక భరోసా కల్పించాలన్నా.. పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. కార్పొరేట్ శక్తుల బాగు కోసమే సీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చారని, ఇది ఎంతమాత్రం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదన్నారు. సీపీఎస్ రద్దే ఏకైక లక్ష్యంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న జిల్లాలో పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలో ఉన్న అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు పెన్షనర్ సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ , టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రావు, శ్రీనివాస రావు, టీడీఎస్ ఉపాధ్యక్షుడు చొక్కయ్య, పెన్షనర్ సంఘం ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, నాయకులు భాస్కర్, సంపత్, రాంనర్సయ్య, ఉప్పలయ్య, నాగార్జున, ప్రభాకర్, రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, విష్ణుబాబు, శ్రీధర్, యాకూబ్, చందర్ పాల్గొన్నారు.


# ఘనంగా బండ్ల బోనాలు

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మాంకాలమ్మ బండ్ల బోనాల పండుగ శుక్రవారం ఘనంగా జరిగింది. పట్టణంలో ఆనవాయితీగా వస్తున్న ప్రకారం స్థానిక పెద్దమ్మ గడ్డ వద్దగల మాంకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని అన్ని వీధుల గుండా ఎడ్ల బండ్లు తిరుగుతూ అమ్మవారి దేవాలయానికి చేరుకొని దేవాలయం చుట్టూ తిరిగిన బండ్ల బోనాలు ప్రజలను భక్తి పారవశ్యంలో నింపాయి. బండ్ల బోనాల కార్యక్రమంలో ప్రధాన ఘట్టమైన గావు పట్టే కార్యక్రమాన్ని కాటం రవీందర్ ఎన్నడూ లేని విధంగా నిర్వర్తించారు. అనంతరం భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇలాంటి అపూర్వమైన ఘట్టం తరతరాలుగా రావడం ఎంతో ఆనందంగా ఉందని పుర ప్రముఖులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, ప్రముఖులు వల్ల ప్రగడ ఉపేందర్ రావు, గుళ్లపల్లి తిరుమల కాంతి కృష్ణ, రాజేశ్వరరావు, వల్లప్రగడ సత్యానంద్, మాజీ సర్పంచులు ముస్త్యాల అరుణ బాల నర్సయ్య, ఔషర్ల యాదయ్య, మాజీ ఎంపీపీ, మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీధర్, కృష్ణాజి రావు, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీష్, ముస్త్యాల తారా యాదగిరి, సురేష్ తో పాటు నాయకులు దాసరి కళావతి, పుర్మా ఆగం రెడ్డి, దాసరి శ్రీకాంత్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.





WANTED విలేకరులు కావలెను




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

## ఇషా చావ్లా..
# రీ ఎంట్రీ..!

**మన చౌరాస్తా, సినిమా :** 2011లో తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న సినిమా ప్రేమ కావాలి. ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న సినిమాగా విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. డైరెక్టర్ విజయ్ భాస్కర్ దర్శకత్వంలో విలక్షణ నటుడు సాయి కుమార్ తనయుడు ఆది సాయి కుమార్ ఈ సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు. ఫస్ట్ మూవీతో హిట్ అందుకున్న ఆది.. అటు నటనపరంగానూ ప్రశంసలు సొంతం చేసుకున్నాడు. ఇక అనూప్ రూబెన్స్ అందించిన మ్యూజిక్ గురించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాలోని ప్రతీ సాంగ్ సూపర్ హిట్. ఇప్పటికే ఈ చిత్రంలోని పాటలు వినిపిస్తూనే ఉంటాయి. అలాగే ఈ సినిమాలో ఆది సాయి కుమార్ సరసన నటించింది ఇషా చావ్లా. ఈ మూవీతోనే కథానాయికగా తన కెరీర్ స్టార్ట్ చేసింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ప్రేమ కావాలి సినిమా హిట్ కావడంతో ఇషా చావ్లాకు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అతి తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో క్లిక్ అయ్యింది. దీంతో ఆ తర్వాత తెలుగులో ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. మొత్తం ఐదు తెలుగు సినిమాలు.. ఒక కన్నడ సినిమాలో అలరించింది. అయితే ప్రేమ కావాలి తర్వాత ఆ స్థాయిలో మరో హిట్ అందుకోలేకపోయింది. దీంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ తగ్గిపోయాయి. నెమ్మదిగా ఇండస్ట్రీకి దూరమయ్యింది. చాలా కాలం పాటు సినిమాలకు బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ఇప్పుడు మళ్లీ రీఎంట్రీ ఇస్తుంది. 2014 నుంచి తెలుగులో ఒక్క సినిమా కూడా చేయని ఇషా చావ్లా.. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి సినిమాతో కంబ్యాక్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. చిరు, డైరెక్టర్ వశిష్ట కాంబోలో రాబోతున్న విశ్వంభర చిత్రంలో ఇషా చావ్లా నటిస్తుంది. ఇందులో మీనాక్షి చౌదరి, ఆషికా రంగనాథ్, త్రిష, సురభి నటిస్తుండగా.. ఇషా స్పెషల్ రోల్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. పదేళ్ల గ్యాప్ తర్వాత తెలుగులోకి రీఎంట్రీ ఇస్తుంది. ఇషా చావ్లా..ఢిల్లీ బ్యూటీ. చదువు పూర్తైన వెంటనే యాక్టింగ్ కోర్స్ తీసుకుంది. ఆ తర్వాత సినిమాల్లో ఆఫర్స్ ప్రయత్నించింది.